



# నవభూమి

## జిల్లా అనుబంధం

24 జులై,2025 గురువారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


లాభసాటి పంటల సాగు దిశగా రైతులు

# దృష్టి సారించాలి



- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- గుడిసెల్లో ఉండే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ప్రతి చెరువులో వేసవి కాలంలో కూడా నీళ్ళు నింపుతాం
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు రఘునాథపాలెం మండలంలో ఏర్పాటు
- రఘునాథపాలెం మండలంలో పర్యటించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ఖమ్మం/రఘునాథపాలెం,నవభూమి, జూలై 23:** లాభసాటి పంటలైన ఆయిల్ పామ్ పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రఘునాథపాలెం మండలం పరికలబోడు తండా గ్రామంలో బుధవారం మంత్రి పర్యటించి, 3 కోట్ల రూపాయలతో పరికలబోడు తండా నుండి రఘునాథపాలెం చింతగుర్తి జి.పి. రోడ్డు వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మల్లేపల్లి క్రాస్ రోడ్ నుంచి పరికలబోడు, కొర్లపూడి క్రాస్ రోడ్డు నుంచి కొర్లపూడి తండా వరకు రోడ్ల నిర్మాణ పనులను నెలన్నర రోజులలో మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదల ఫోటో తీసుకుని వస్తే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని అన్నారు.

రేషన్ కార్డులు పేదలకు అందేలా చూడాలని మంత్రి తెలిపారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు అడిగితే తప్పనిసరిగా మంజూరు చేస్తానని మంత్రి తెలిపారు. గతం నుంచి తనకు ఈ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. గత ఖమ్మం అర్బన్ ప్రాంతాన్ని రఘునాథపాలెం మండలం ప్రత్యేకంగా తాను ఏర్పాటు చేశానని, 33 చెరువులకు ఎత్తిపోతల పథకం నుంచి నీరు తీసుకుని వచ్చానని, మిగిలిన ప్రాంతాలకు కూడా నీరు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి నీరు రేపు విడుదల చేస్తున్నామని అవసరమైన చెరువుకు నీరు మళ్లించే అవకాశం ఉందని అన్నారు. రైతులు పామాయిల్, వక్క వంటి పంటలు సాగు చేసుకోవాలని వీటికి మిర్చి, పత్తి వంటి అంతర పంటలు వేసుకోవచ్చని అన్నారు. పామాయిల్ సాగు చేస్తే ఎకరానికి 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మొక్కలకు, అంతర్ పంటలకు, డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తామని అన్నారు. 10 కిలోమీటర్ల దూరంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందని, రైతుల పొలాల వద్దకే వచ్చి పంట కొనుగోలు చేస్తారని మంత్రి తెలిపారు. పామాయిల్ పంట సాగు చేస్తే ఎకరానికి 2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉంటుందని అన్నారు. వేసవి కాలంలో కూడా రఘునాథపాలెం మండలంలో చెరువుల నింపే బాధ్యత తీసుకుంటానని, మంచి లాభ సాటి పంటలు రైతులు సాగు చేయాలని మంత్రి కోరారు. పిల్లలు మంచి చదువులు చదివేందుకు రఘునాథపాలెం మండలంలో అద్భుతమైన పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, స్వామినాథన్ సంస్థ ద్వారా పాఠశాల, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలను స్థానికంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు చదువుకొని ఉన్నత స్థితికి వెళ్తే మనం నిశ్చింతంగా ఉండవచ్చని అన్నారు. పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి చదువు మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి సూచించారు.










కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు నిరంతరాయంగా మంత్రివర్యులు కృషి చేస్తున్నారని అన్నారు. పామాయిల్ పంటను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే దిశగా నిర్విరామ కృషి చేస్తున్నారని అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో నూతనంగా 3992 రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని, రఘునాథపాలెం మండలంలో 980 కుటుంబాలకు రేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మంజూరైన నూతన రేషన్ కార్డులను గ్రామంలోని మహిళలకు అందజేశారు. అంతకుముందు మహిళలు కోలాటం, బంజార నృత్యం చేస్తూ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఆత్మ కమిటీ చైర్మన్, పిఏసిఎస్ కమిటీ చైర్మన్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో ఎరువుల ఫిర్యాదుల సెల్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జిల్లాలో ఎరువుల కొరత లేదు
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- ఎరువుల సంబంధ ఫిర్యాదులపై టోల్ ఫ్రీ నెం. 1077, సెల్ నెం. 9063211298 లకు కాల్ చేయాలి





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై 23**: జిల్లా కేంద్రం, కలెక్టరేట్ లో ఎరువుల ఫిర్యాదు సెల్ ను ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు ఉన్న టోల్ ఫ్రీ నెం. 1077, సెల్ నెం. 9063211298 లకు కాల్ చేసి, ఫిర్యాదు చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రస్తుత వానాకాలం 2025 సీజన్ కు సంబంధించి జిల్లాలో 3 లక్షల 80 వేల 852 ఎకరాల్లో ప్రధాన పంటలైన వరి, ప్రత్తి, అపరాలు, మొక్కజొన్న సాగులో ఉన్నాయన్నారు. వానాకాలం పంట కాలం మొత్తానికి 41 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 26 వేల 464 మెట్రిక్ టన్నుల డిఏపి, 20 వేల 857 మెట్రిక్ టన్నుల ఎంఓపి, 88 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 6 వేల 780 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పి అవసరమని అంచనా వేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కావాల్సినంత ఎరువులు అందుబాటులో ఉన్నట్లు, ఎక్కడా ఎరువుల కొరత లేదని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే, అధిక ధరలకు అమ్మకం జరిపితే చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. రైతులు తమ ఆధార్ కార్డ్ పిఓఎస్ మిషన్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడైనా ఎరువుల కృత్రిమ కొరత ఉన్నట్లు గమనిస్తే, అధిక ధరలకు అమ్మకం జరిపితే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టరేట్ లో రైతుల సౌకర్యార్థం ఎరువుల ఫిర్యాదు సెల్ టోల్ ఫ్రీ నెం. 1077, సెల్ నెం. 9063211298 లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు కొరకు సెల్ నెం. 8977741771 ని ప్రభుత్వం కేటాయించిందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏసీబీ డిఎస్పీ రమేష్‌కు అవార్డు

**కొత్తగూడెం జులై 23 నవభూమి ప్రతినిధి:** మెరుగైన పనితీరు కనపరచినందుకు ఖమ్మం రేంజ్ ఏసీబీ డిఎస్పీ వై.రమేష్ కు ఆ శాఖ డిజిపి విజయకుమార్ బుధవారం హైదరాబాద్ లో అవార్డు అందజేశారు. గతంలో కూడా రమేష్ అవార్డు అందుకున్నారు. అవార్డు తో పాటు క్యాష్ రివార్డ్ కూడా ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఏసీబీ దూకుడుగా వ్యవహారిస్తూ, అవినీతిపరుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తిస్తున్నారు.



# ఉమ్మడి జిల్లాకు ఇద్దరు ఐఏఎస్‌లు



**కొత్తగూడెం జులై 23 నవభూమి ప్రతినిధి:** 2023 బ్యాచ్‌కు చెందిన ఇప్పటివరకు శిక్షణలో ఉన్న ఆరుగురు ఐ ఏ ఎస్ అధికారులకు పోస్టింగ్ లు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు, భద్రాచలం లలో ఉన్న ఆర్డీఓ లను బదిలీ చేసి సబ్ కలెక్టర్ లుగా ఐ ఏ ఎస్ లు నియమించారు. కల్లూరు కు అజయ్ యాదవ్, భద్రాచలం కు మృణాల్ శ్రేష్ఠ లను సబ్ కలెక్టర్ లుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి

# గుండాలలో విద్యాసంస్థల బందు విజయవంతం



**గుండాల జులై 23 నవభూమి:** గుండాల మండల కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంధు విజయవంతం అయ్యింది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేసే ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న పిలుపునిచ్చిన విద్యాసంస్థల బందు విజయవంతం అయిందని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఎస్కే నసీర్, పి డి ఎస్ యు నాయకులు లోకేష్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బకాయి ఉన్న 8 వేలకోట్ల విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయి కావున హాస్టల్ విద్యార్థులకు మెస్సు చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలో మౌలిక సదుపాయాలను కల్పించి, ఆర్టీసీ లో విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కొప్పుల పవన్ కళ్యాణ్, ఎస్కే షబ్బీర్, పిడిఎస్యు నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తహసీల్దార్‌కి యూఎస్పిసి మెమొరాండం



**తిరుమలాయపాలెం, నవభూమి జూలై,23:** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్పిసి )ఇచ్చిన మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా మొదటి దశగా బుధవారం తిరుమలాయపాలెం మండల తాసిల్దార్‌కి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఉపాధ్యాయ సమస్యలతో కూడిన మెమొరాండం సమర్పించారు. బదిలీలు, ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న బిల్స్ వెంటనే క్లియర్ చేయాలని, పి ఆర్ సి, డి ఏ లు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం తెస్తున్న కొత్త పెన్షన్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, తదితర సమస్యలపై మొదటి దశ పోరాటం గా మండల తహసీల్దార్ కి మెమొరాండం సమర్పించడం, రెండవ దశగా ఆగస్టు1 న , జిల్లా కేంద్రాలలో ధర్నా, మూడవ దశలో ఆగస్ట్,23 న హైదరాబాద్ లో ధర్నా కార్యక్రమాలు తలపెట్టనున్నామని యూఎస్పిసి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్పిసి భాగస్వామ్య సంఘాల నాయకులు నాగేశ్వర రావు, బి.కేష్యా, డి.వెంకట్రాములు, . లక్ష్మీ, భద్రయ్య, ధన మూర్తి, బి.వీరబాబు,బి.హనుమంత్, శ్రీనివాస్,రఘుబాబు.శ్యాంకుమార్, సుభాషిణి,.వాణిశ్రీ, విజయ లక్ష్మీ,గోపమ్మ , డి.కృష్ణకళ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలి

■ ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్

**గుండాల జులై 23 నవభూమి:** కర్ణాటక రాష్ట్రంలో పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా భావించే ధర్మస్థలలో 300 పైన ఆడపిల్లల, మహిళల మీద అత్యాచారాలు జరిపి, హత్య చేసి పూడ్చిపెట్టిన విషయం బహిర్గతమై వారం రోజులు కావస్తున్నా, ఆలయ ధర్మకర్త, యాజమాన్యం మీద ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేయడం ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి అనసూయ అందే మంగ పిలుపునిచ్చారు. బెంగళూరు సిటీ సివిల్ కోర్టు శ్రీ క్షేత్రం ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే కుమారుడు హర్షవర్ధన్ హెగ్డే మీద ఎలాంటి వార్తలు ప్రచురించవద్దని ఆదేశించడం వంటి చర్యలు దీని వెనకాల బలమైన శక్తులు ఉండి ఉంటాయన్న అనుమానాలకు తావు ఇస్తున్నది. దేశవ్యాప్తంగా మహిళలపై, బాలికలపై పెరుగుతున్న అత్యాచారాలు హత్యల నేపథ్యంలో నేరస్తులు ధైర్యంగా మమ్మల్ని ఎవరూ ఏం చేయలేరని బాహాటంగానే ప్రకటిస్తున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో యూపీలో, ఢిల్లీలోని నోయిడా ప్రాంతాల్లో ఇటువంటి సామూహిక హత్యల ఖననాల ఉదంతాలు బహిర్గతమైనవి. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలుగా భావించే మఠాలు, ఆశ్రమాలు ఆలయాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రజలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యవర్గం ఈ విషయాల పట్ల తీవ్ర ఆందోళనను వ్యక్త పరుస్తూ, ధర్మస్థలలో సామూహిక ఖననాల విషయంలో సిట్టింగ్ జడ్జి చేత నిష్పక్షిక విచారణ జరిపించి నేరస్తులను కఠినంగా శిక్షించాలి, బాధితులకు, గతంలో ఫిర్యాదు చేసిన వారికి, ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన వారికి రక్షణ కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.అనసూయ, అందే మంగ కోరారు.



## నాణ్యమైన ఆహారాన్ని తాజాగా ప్రభుత్వ సంక్షేమ

# హాస్టళ్ళ విద్యార్థులకు అందేలా పటిష్ట చర్యలు

- ■ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ■ జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమించి, వారానికి ఒకసారి సంక్షేమ హాస్టళ్ళ తనిఖీకి ఆదేశాలు
- ■ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లలో భోజన నాణ్యతపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై 23:** ఖమ్మం జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్ లలో నాణ్యమైన ఆహారాన్ని తాజాగా విద్యార్థులకు అందేలా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ సంక్షేమ శాఖలచే 122 రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో సుమారు 13 వేల 876 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉచిత విద్యతో పాటు వసతి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు. ఇందులో బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, ఎస్సి సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పాఠశాలలు/కళాశాలలు నిర్వహించబడుతున్నాయన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పకడ్బందీ కార్యాచరణ చేశామన్నారు. రోజూ రెండు అల్పాహారాలు, సన్న బియ్యంతో వండిన అన్నంతో కలిపి ఏడు రకాల పదార్థాలు, గుడ్డు, నెలకు ఆరుసార్లు మాంసాహారంలతో విద్యార్థులకు సంపూర్ణ భోజనం అందించేలా ప్రభుత్వం మెనూ అమలు చేస్తుందన్నారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజనింగ్ వంటి సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ హాస్టళ్ళలో భోజనం, వసతి పర్యవేక్షణ కు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా కేటాయించామన్నారు. ప్రత్యేక అధికారులు, వారి పరిధిలోని సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మికంగా తనిఖీ చేస్తూ, అక్కడి ప్రాంగణంలో పాటిస్తున్న పారిశుధ్య చర్యలు, పిల్లలకు వండుతున్న ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యత, త్రాగునీటి సరఫరా, వంట ప్రదేశం పరిసరాలు, కిచెన్ రూమ్ లో పరిశుభ్రత, మెనూ ఎలా పాటిస్తున్నారో వంటి పలు అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ అవసరమైన సూచనలు జారీ చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. వారానికి ఒకసారి ప్రత్యేక అధికారులు సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులతోనే భోజనం చేసి, భోజనం నాణ్యత, మెరుగైన సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన చర్యలు, సమస్యలపై నివేదిక సమర్పిస్తారన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కలిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదివే పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, బయటి ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లోకి అనుమతించడం లేదని, ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూ ప్రకారం శుచికరమైన, రుచికరమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సమగ్ర శిక్షా అభియాన్ జేడి ఆకస్మిక తనిఖీ

**జూలురుపాడు, జూలై 23 (నవభూమి ప్రతినిధి):**-మండల కేంద్రంలోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ డైరెక్టర్ వెంకట నర్సమ్మ, కే జీ బి వి రాష్ట్ర కో ఆర్డినేటర్ శిరిషా తో కలసి ఆకస్మికంగా సందర్శించారు.విద్యాలయాన్ని కలియ తిరిగి పరిశీలించారు.విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరీక్షించారు.గణితంలో కొందరు విద్యార్థిని లు వెనుకబడినట్లు గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.నిత్యావసర పదార్థాల నిల్వ గదిని, వంట గదిని తనిఖీ చేశారు.ప్రతి రోజు మెనూ ప్రకారం శుచి రుచి కరమైన ఆహార పదార్థాలు వడ్డించాలని ఆదేశించారు.వర్షాకాలంలో తరుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని విద్యార్థులకు సూచించారు.మండల విద్యాధికారి జుంకీలాల్, విద్యాలయ ప్రత్యేక అధికారి పద్మజ ఉన్నారు.



నవభూమి



# ప్రపంచం గర్వించదగ్గ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

- ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆగస్టులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం
- మూడేళ్లలో పూర్తి స్థాయి నిర్మాణం
- ఈ విద్యా సంవత్సరం నుండి యూజీ, పీజీ కోర్సులు ప్రారంభం
- జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే చారిత్రాత్మక అడుగు



**కొత్తగూడెం జులై 23 నవభూమి ప్రతినిధి:** ప్రపంచంలో గర్వించదగ్గ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో పాల్వంచలో బుధవారం యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కమిషనర్ కాలేజ్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, ఇతర విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రారంభానికి సంబంధించి



అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. వివిధ శాఖల ఉన్నతాధికారుల సూచనలతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ప్రవేశపెట్టాల్సిన కోర్సులు, మౌలిక సదుపాయాలు, భవనాల నిర్మాణం, నిధుల సమీకరణ తదితర అంశాలపై సమీక్ష జరిగింది. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ మరియు పీజీ స్థాయిలో బిఎస్సీ జియాలజీ, బిఎస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సులు ప్రారంభించాలని, ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు సూచనలు ఇచ్చారు. రాబోయే మూడు సంవత్సరాలలో పూర్తి స్థాయి విశ్వవిద్యాలయం నిర్మాణం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, విదేశాలలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను సందర్శించి అభ్యాసం చేసి, అక్కడి అనుభవాల ఆధారంగా మౌలిక సదుపాయాలు, కోర్సుల రూపకల్పన చేయాలని నిర్ణయించారు.

అంతేగాక, విద్యార్థులకు పరిశోధనలో ప్రోత్సాహం కల్పిస్తూ, ఉద్యోగ అవకాశాలు పొందేలా యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. దీనికోసం రూసా నిబంధనల ప్రకారం నిధుల సమీకరణ చేయాలని కూడా పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా రంగానికి సంబంధించిన కీలక అధికారులంతా సమావేశంలో పాల్గొని, ప్రపంచంలో మొట్టమొదటి ఎర్త్ సైన్స్‌కు ప్రత్యేకమైన యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన చర్యలు, కోర్సులు, విద్యార్థుల సంఖ్య వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రికి సమర్పించి, వారి ఆమోదంతో ఆగస్టులో యూనివర్సిటీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉద్యమ కాలంలోనే ఈ యూనివర్సిటీకి సంబంధించిన సంకల్పం తీసుకున్నట్లు గుర్తు చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖనిజ సంపదకు కేంద్రంగా నిలుస్తుందని, జిల్లాలోని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. కలెక్టర్ ఇప్పటికే ఒక నివేదికను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారని, శాసనసభ్యుల సహకారంతో ప్రభుత్వం మద్దతు తీసుకురాగలిగామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జియాలజీ, భూవిజ్ఞానానికి సంబంధించిన విశ్వవిద్యాలయాలు ఉన్నా, పూర్తిగా ఎర్త్ సైన్స్‌కు అంకితమైన విశ్వవిద్యాలయం ఇదే మొదటిదని స్పష్టమైంది. అత్యున్నత స్థాయికి ఈ విశ్వవిద్యాలయం ఎదగాలంటే, యోగితా రాణా లాంటి అనుభవజ్ఞులైన అధికారుల పర్యవేక్షణ ఎంతో కీలకమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేటాయించిన 300 ఎకరాల భూమిలో, మూడు సంవత్సరాలలో శాశ్వత భవనాలు, అవసరమైన వసతులతో కూడిన యూనివర్సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రితో చర్చించి అవసరమైన నిధులను కేటాయిస్తామని పేర్కొన్నారు. అంతిమంగా, ముఖ్యమంత్రి ఆలోచన మేరకు భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరుతో ఈ విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ గా నామకరణం చేయాలని మంత్రివర్గం ఆమోదించిన విషయాన్ని మంత్రి తెలియజేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జిల్లా అభివృద్ధికి శుభ పరిణామన్నారు. జిల్లా, రాష్ట్ర,దేశంలోని విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం ద్వారా వారి యొక్క విద్య ప్రమాణాలు పెంచుకోవడానికి మరియు మెరుగైన ఉద్యోగ అవకాశాలు సాధించటానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశాలు మొదలవుతాయని, రాబోయే మూడు సంవత్సరాలలో విశ్వవిద్యాలయంలో కావలసిన అన్ని కోర్సులు ప్రవేశపెడతామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు భూమిపై అవగాహన, భూమికి సంబంధించి అన్ని పరిశోధనలకు సంబంధించిన అన్ని కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఎర్త్ సైన్స్



యూనివర్సిటీలో విద్యార్థులకు సౌకర్యాలు, వివిధ రకాల కోర్సులు తదితర సదుపాయాలు కల్పనకు వివిధ దేశాల విశ్వవిద్యాలయాల సమన్వయంతో రూపొందిస్తామన్నారు. దీనికిగాను మూడు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆ కమిటీల ద్వారా ఏ కోర్సులు ప్రవేశపెట్టాలి, ఉపాధ్యాయులు నియామకం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కమిషనర్ కాలేజ్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప వ్యక్తి పేరు మీద ఏర్పాటైన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించటం మన రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రాముడు కాలు మోపిన ఈ భూమిలో అద్భుతమైన యూనివర్సిటీ స్థాపించడంలో దేశంలోనే వివిధ రంగాలలో నిపుణులను కమిటీలో సభ్యులుగా చేయడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిస్థాయి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు కృషి చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే జియో లాజికల్ మ్యూజియం గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉందని అన్నారు. జిల్లాలో అద్భుతమైన కనీస సంపద, గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నటువంటి ఈ జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపన ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థులు తో పాటు పాటు దేశంలోని విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తాను కూడా ఒక మారుమూల ప్రాంతం నుండి ఐఐటి చదివి ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనలో పాలుపంచుకోవడం ఎంతో గర్వ కారణంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇల్లందు క్రాస్ రోడ్ లోని టూరిజం హోటల్ ను పరిశీలించి,హోటల్ నిర్మాణ పనులను త్వరితగతిని పూర్తి చేయాలని., ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం,టూరిజం హోటల్ ను ప్రారంభించే విధంగా అన్ని పనులను పూర్తి చేయాలని, ఆవరణలో ఆకర్షణీయంగా మొక్కల పెంపకం సుందరీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి,వైస్ ఛాన్సలర్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి,వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి , సెక్రటరీ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శ్రీ రామ్ వెంకటేష్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రన్, రూసా ప్రతినిధి సౌందర్య జోసెఫ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని జెడ్పి స్థానాలకు పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలి

## గుండాల బిజెపి ఇంచార్జి బిజ్జం శ్రీనివాసరెడ్డి



**గుండాల జులై 23 నవభూమి:** త్వరలో జరగనున్న జడ్పిటిసి ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉండాలని గుండాల బిజెపి పార్టీ ఇంచార్జి బిజ్జం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ ఆఫీసులో బిజెపి మండల అధ్యక్షుడు సోలం సతీష్ అధ్యక్షతన సనాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మన పార్టీ నుంచి అన్ని స్థానాలలో పోటీ చేయాలని అవగాహన కల్పించారు. ఇప్పటినుంచి అభ్యర్థులను నిలబెట్టేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా మన భారతీయ జనతా పార్టీ మెరుగుపడిందన్నారు. ఇప్పటి నుంచే ప్రచారం చేస్తే గెలుపు ఈజీగా ఉంటుందన్నారు. గెలుస్తామా లేదా అనే విషయాన్ని మీ దృష్టిలో నుండి తీసేసి గెలవడానికి సిద్ధంగా ఉన్నామని ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండాల మండల అధ్యక్షులు సోలం సత్యష్, మండల ప్రెసిడెంట్ గోగ్గల కృష్ణ, రాధాకృష్ణ, నరేష్, రమేషి, అశోక్, రవి ప్రభకర్ తదితరులు పాల్గొన్నారు

# గార్లలో విద్యా సంస్థల బంద్ విజయవంతం



**గార్ల, నవభూమి, జులై 23:** విద్యా రంగ సంస్థల సమస్యలు పరిష్కారించడంలో పాలకులు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం గార్లలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్, పి డి ఎస్ యు జిల్లా కోశాధికారి మునగాల మహేష్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్ లు మాట్లాడుతూ విద్యా రంగానికి ప్రాధాన్యతనివ్వడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 19 నెలలు గడుస్తున్న విద్యా శాఖ మంత్రి నియమించక పోవడం శోచనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటు కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీ నియంత్రించాలని, పెండింగ్ స్కాలర్ షిప్పులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సంతోష్, కిరణ్, ఉదయ్, పృథ్వీ రాజ్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్త అవసరం

## ఎస్ఐ చంద్రశేఖర్




**అన్నపురెడ్డిపల్లి జులై 23 నవభూమి:** మండల ప్రజలకి తెలియజేవు విషయం ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్ ద్వారా ప్రభుత్వ అధికారుల పేరు చెప్పి డబ్బులు ఇవ్వమన్నారని కాల్స్ చేసి డబ్బులు అడుగుతున్నారని పోలీస్ స్టేషన్ కి సమాచారం వచ్చింది. ఇటువంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండగలరని అన్నపరెడ్డిపల్లి మండల గ్రామ ప్రజలకు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ సి హెచ్ చంద్రశేఖర్ తెలిపారు.

# మహిళల చిరునవ్వులతో ప్రభుత్వం మనుగడ

- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు స్వేచ్ఛ, భరోసా
- అన్ని సంక్షేమ పథకాలు మహిళలకే
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తగూడెం, పాల్వంచలో నూతన బస్టాండ్ల నిర్మించాలి: ఎమ్మెల్యే కూనంనేని







**కొత్తగూడెం జిల్లా 23 నవభూమి ప్రతినిధి:** మహిళల చిరునవ్వుతోనే ప్రభుత్వం మనుగడ సాగిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ లో 200 కోట్ల ఉచిత ప్రయాణాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు విద్యాచందన, డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజే సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్లు మంది ఇప్పటివరకు ప్రయాణాలు సాగించారన్నారు. దీని ద్వారా మహిళలకు ప్రయాణ చార్జీ రూపంలో రూ.6680 కోట్లు ఆదా అయ్యాయి అని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు స్వేచ్ఛ, భరోసా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి అన్ని సంక్షేమ పథకాలను మహిళలకే రూపొందించింది అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 9 బస్సులు నడుపుతున్నారు అని తెలిపారు. మహిళలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలతో ఏ సంక్షేమ పథకమైన ఇందిరమ్మ ఇల్లు, 500 గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు అన్ని మహిళలకే రూపొందించడం జరిగిందన్నారు. మహిళలకు ఇవ్వడం ద్వారా తమ కుటుంబాల అభివృద్ధితోపాటు దేశ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం పరుచుకొని మహిళలను అభివృద్ధి చెందాలన్నారు. దేశంలోనే ప్రభుత్వం చేపడుతున్న పథకాలు తెలంగాణ మోడల్ గా ఉన్నాయన్నారు. కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో భాగంగా కొత్తగూడెం నుండి హైదరాబాద్, నాగపూర్, రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారులు మంజూరు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కొత్తగూడెం ప్రధాన నగరంగా రూపాంతరం చెందుతుందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారులతో పాటు విద్య, వైద్య రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మణుగూరు నుండి కిరండోల్ రైల్వే లైన్ నిర్మాణానికి మంజూరు కాగా పాండురంగాపురం నుండి భద్రాచలం వరకు 16 కిలోమీటర్ల రైల్వే లైన్ ను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ద్వారా పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఒకప్పుడు నష్టాలలో ఉన్న ఆర్టీసీ సంస్థ ప్రభుత్వం ఏర్పడిన 18 నెల కాలంలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలతో 6680 కోట్ల రూపాయలు ఆదాయాన్ని గడించటం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.కొత్తగూడెం, పాల్వంచలో నూతన బస్టాండ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మహిళలు వారి కాళ్ళ మీద వారు నిలబడటం తో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఉపయోగపడుతున్నాయి అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకొని మహిళలు ఉద్యోగాలకు, వైద్య అవసరాలకు, చదువుకోవడానికి ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుందని దీని ద్వారా ఆత్మస్థైర్యాన్ని ప్రభుత్వం నింపిందన్నారు. అనంతరం జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిలా విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులకు, లబ్ధి చేకూరిన మహిళల కు మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న పాకాల ఏరు

- నీట మునిగిన రోడ్‌వే కం చెక్ డ్యాం
- 15 గ్రామాలకు రాకపోకలు బంద్



**గార్ల, నవభూమి, జులై 23:** తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వస్తున్న వరద నీటితో మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలోని పాకాల ఏరు పొంగి ప్రవహిస్తుంది. ఏరు రెండు అంచులకు తాకి ఉధృతం ప్రవహిస్తుండడంతో పాటు పాకాల ఏటిపై నిర్మాణం చేసిన రోడ్ వేకం చెక్ డ్యాం వరద నీటిలో పూర్తిగా మునిగి పోయింది. ప్రతినిత్యం తమ కనీస అవసరాలు తీర్చుకోవడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే గార్ల మండలం పరిధిలోని రాంపురం, మద్ది వంచ గ్రామ పంచాయతీ ప్రజలతో పాటు డోర్నకల్,కురవి, మహబూబాబాద్ మండలాలకు చెందిన పలు గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్ వేకం చెక్ డ్యాం మీదుగా గార్ల కు వస్తుంటారు. గత వారం రోజులుగా చెక్ డ్యాం నీట మునిగి ఉండటం తో ఏమి చెయ్య లేని నిస్సహాయక స్థితిలో ఆయా గ్రామాల ప్రజలు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి సుమారు ఇరవై కిలోమీటర్ల దూరం ప్రయాణించి మండల కేంద్రమైన బయ్యారం మీదుగా గార్ల వస్తూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. మరి కొందరు పాకాల ఏటిపై దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్మించిన రైలు వంతెన పైనుండి పాదయాత్ర చేస్తూ గార్లకు వస్తున్నారు. వీరి ప్రయాణాన్ని సైతం రైల్వే అధికారులు ఆంక్షలు విధించటతో పాటు పలువురిపై గతంలో కేసులు పెట్టిన సంఘటనలు ఉన్నాయి. చెక్ డ్యాం ప్రాంతంలో హైలెవల్ వంతెన నిర్మాణం చేయాలని పలుమార్లు రాంపురం, మద్ది వంచ గ్రామ పంచాయతీ గ్రామాల ప్రజలు, వివిధ రాజకీయ పక్షాలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టం, మండల, జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా ప్రజా ఆందోళన చేసిన ఫలితం శూన్యమైంది. చెక్ డ్యాం పైనుండి రాకపోకలు నిలిపి వేస్తూ గార్ల పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## గార్ల చెక్ డ్యాంపై బిఆర్ఎస్ ఆందోళన



**గార్ల, నవభూమి, జులై 23**: పాకాల ఏటిపై హైలేవల్ వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయడం లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు బుధవారం పాకాల చెక్ డ్యాం పై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 15 కోట్ల రూపాయలను విడుదల చెయ్యగా ఆ నిధులను వేరే వైపు మళ్ళించి నిర్లక్ష్యం చేయడం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసి హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధా కృష్ణ, మాజీ ఎంపిటిసి శీలం శెట్టి రమేష్, బుడిగ మురళి, ఉమేష్, వెంకట్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## 40 కేజీల బెల్లం, పటిక, నాటుసారా పట్టివేత



**టేకులపల్లి జూలై 23 నవభూమి ప్రతినిధి :** నాటుసారా రవాణా సమాచారం మేరకు బొమ్మనపల్లి క్రాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించిన కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం, ద్విచక్ర వాహనం మీద తరలిస్తున్న 40 కేజీల బెల్లం, 2 కేజీల పటిక, 2 లీటర్ల నాటు సారాయి పట్టుకుని బిల్లుడు తండాకు చెందిన బానోతు కిషన్ మీద కేసు నమోదు చేసి, అతని నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డిటిఎఫ్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, వెంకటనారాయణ, సుమంత్, శ్రావణి, రమేష్, పార్థసారథి పాల్గొన్నారు.

## వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్లను ఆవిష్కరించిన కాచం సత్యనారాయణ గుప్తా



**పాల్వంచ జులై 23 నవభూమి ప్రతినిది:** వైశ్య వికాస వేదిక ఆధ్వ ర్యంలో ఆగస్టు మూడో తేదీన హైదరాబాదు లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని వైశ్యవికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సత్యనారాయణ గుప్తా అన్నారు. పట్టణ పరిధిలోని జివిఎస్ కాన్వెంక్షన్ హాల్ లో బుధవారం వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు 30 ఎంపీపీ, 30 జెడ్పిటిసి, కనీస ఒక జడ్పీ చైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల్ చైర్మన్ స్థానాలకు అవకాశం కల్పిం చాలన్నారు. ఈడబ్ల్యు ఎస్ లో వర్గీకరణ తెచ్చే వరకు వైశ్య వికాస వేదిక పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొదుమూరి దయాకర్ , చవ్వ సంతోష్ కుమార్, గిరిధర్ , సంక రవి, సర్వేష్ , మహంకాళి సాయి , పెండ్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు

## నేడు టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా మహాసభలు

- అతిథులుగా మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల
- హాజరు కానున్న విరాత్ అలీ, రాంనారాయణ

**ఖమ్మం, నవభూమి జులై 23**: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా నాల్గవ మహాసభలు గురువారం వైరాలోని శబరి గార్డెన్స్లో జరగనున్నాయి. ఖమ్మం జిల్లా నలు మూలల నుండి జర్నలిస్టులు ఈ మహాసభకు హాజరుకానున్నారు. 650 మంది జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తూ 450 మంది జర్నలిస్టులు ప్రతినిధులుగా హాజరుకానున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా, సత్తుపల్లి శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి లు హాజరుకానుండగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాత్అలీ, కె. రాంనారాయణలు హాజరు కానున్నారని తెలిపారు. మహాసభల్లో అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాల సమస్య, హెల్త్ కార్డులు, రైల్వే పాసుల పునరుద్దరణ, జర్నలిస్టులకు పింఛన్, భద్రత, ఇండ్ల స్థలాల సమస్య, వేతన చట్టం అమలు తదితర -విషయాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు.




జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ. రవీంద్రశేషు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగో పాల్, కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు లు -హాజరుకానున్నారని వనం, ఏనుగు వెంకటేశ్వరరావు లు తెలిపారు. మహాసభలకు సంబంధించి ఆహ్వాన సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

## రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థలు బంద్ పాల్వంచలో విజయవంతం

- పెండింగ్ ఫ్లీజ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలి
- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
- విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి




**పాల్వంచ జులై 23 నవభూమి ప్రతినిది:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని తదితర డిమాండ్లతో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ సందర్భంగా బుధవారం పాల్వంచ పట్టణ పరిధిలోని వివిధ విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా




సహాయ కార్యదర్శి గుండాల సుజన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకున్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ నిధులు వెంటనే విడుదల చేయాలని, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని, మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని, ప్రైవేట్,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, విద్యార్థులకు ఆర్టీసీ లో ఉచిత బస్ పాస్ లు ఇవ్వాలని, నూతన జాతీయ విద్య విధానం తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని శాంతియుతగా బంద్ నిర్వహించినట్లు తలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పటానికి విద్యార్థి లోకం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్మసౌత్ మహేష్, మాతంగి అనిరుద్, జుంజునూరు రాజ్ కమల్, శ్రీకాంత్, మహేష్, రవి, వెంకటేష్, సునీల్, యోగి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం...ఏఐఎస్ఎఫ్

**ఏర్రుపాలెం,నవభూమి,జులై 23:** తెలంగా ణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు,జూని యర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండలం లో నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు ఉగ్గం సురేష్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని,రాష్ట్రంలోవిద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థిసంఘాల ఆధ్వ ర్యంలో మండలంలోనిర్వహించిన బంద్ తో మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్,వెంటనే విడు దల చేయాలని,గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, విద్యాశాఖమంత్రినితక్షణమేనియమించాలనిఇంటర్ కళాశాలలోమధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడు దలచెయ్యాలని,ప్రైవేట్,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజులనియంత్రణ చట్టం తీసుకు రావాలన్నారు.విద్యార్థులకు ఆర్టీసీ లో ఉచిత బస్పాస్ లు ఇవ్వాలని,నూతన జాతీయ విద్య విధానం తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మా నం చెయ్యాలని కోరారు.ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యను పరిష్క రించాలని,వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు సహక రించి విజయవంతం చేసిన




విద్యాసంస్థ లకు,ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రణీత్, అభినయ్,వెంకట్,గోపి తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సాయంతో ఏవోకు తప్పిన ప్రమాదం



కారేపల్లి, నవభూమి, జూలై 23: కారేపల్లి మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్ కుమార్ బుధవారం నీటి ప్రవాహంలో చిక్కుకోని ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాదెపాడు రైల్వే అండర్ బ్రిడ్జీ లో వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వ్యవసాయ పంటలను పరిశీలన, ఎరువుల దుకాణాల తనిఖీకి కారేపల్లి మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్‌కుమార్ చీమలపాడు ప్రాంతానికి వెళ్లటానికి బస్వాపురం, చర్లపల్లి మీదిగా వెళ్తున్నాడు. గాదెపాడు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జీ లో నీరు ప్రవహిస్తుండగా ఆ నీటి ఉధృతిని అంచనా వేయకుండా తక్కువగా వస్తున్నాని తలంచిన ఏవో బ్రిడ్జీ నీటిలో నుండి కారును తీసుకవెళ్ళక నీటి ఉధృతికి కారు అగి నీటిలో చిక్కుకుంది. నీరు 5 మీటర్లు ప్రవహిస్తుండటంతో కారు ఎటు వెళ్లలేని పరిస్థితి వచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన చుట్టుపక్కల రైతులు కారు వద్దకు వెళ్ళి అతి కష్టం మీద కారు డోర్ తీసి ఏవోను రక్షించారు. దీంతో పెద్దప్రమాదం తప్పింది.ఏవో కారును తాళ్లు కట్టి బయటకు లాగారు.

# జూలూరుపాడులో విద్యాసంస్థల బంద్ విజయవంతం




జూలూరుపాడు,జూలై 23 (నవభూమి ప్రతినిధి) వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వ్యాపితంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పెరుమాళ్ళ పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎనిమిది వేల కోట్ల రూపాయల స్కాలర్ షిప్,ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 19 నెలలు కావస్తున్న ఇప్పటివరకు పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. బంద్ కు ఏ ఐ వై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్ పాషా సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థి, యువజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాపల మదుగు హర్ష వర్ధన్, సాయి తేజ,రామ్ చరణ్,వాసు,ఎస్ఎఫ్ఐ నాయకులు పృథ్వి,చరణ్,నవీన్,పవన్ కుమార్, నాగరాజు సంతోష్,కిరణ్ కుమార్,సురేష్ తదితరుల పాల్గొన్నారు.

# రైతులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి:సొసైటీ అధ్యక్షులు అనుమోలు

ఎర్రుపాలెం,నవభూమి,ఏప్రియల్ 10 : రైతులు సహకార సంఘాల ద్వారా అందించిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అయ్యవారిగూడెం సహకార సంఘం అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు అన్నారు.సొసైటీ పరిధిలోని రైతులకు బుధవారం రుణాలను అందించారు.సంఘ పరిధిలోని మొత్తం పాత సభ్యులు 53 మందికి గాను 38 లక్షల రూపాయలు ఏర్రుపాలెంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందించారు.అదే విధంగా సంఘసభ్యులైన రాజుల దేవర పాడు గ్రామానికిచెందినపొదిలిసరవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సరవయ్యకు అయ్యవారిగూడెం సహకార సంఘంలో సభ్యత్వంఉండడంతో ప్రభు త్వం నుంచిమంజూరైన 50వేల రూపా యల భీమా నగదును ఆయన భార్య వెంకటరావమ్మకు సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు,బ్యాంకు మేనేజర్ దివ్య ఎర్రుపాలెంలోని డీసీసీబీ బ్యాంక్ నందు బుధవారం అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లా డుతూ సంఘంలో గతంలో రుణాలు పొందిన 53 మంది రైతులకు రుణాలను పెంచిఇవ్వడంజరిగిందన్నారు.వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో విత్తనాలకు, ఎరువుల కొనుగోలుకు,పెట్టుబడులకు ఈ



రుణాలుఉపయోగపడతాయని అన్నారు. రైతులు ఈ రుణాలను వ్యవసాయ అవస రాలకు వినియోగించుకొని లబ్ది పొందాల న్నారు.అదేవిధంగా సంఘ సభ్యుడైన పొదిలి సరవయ్య మృతి బాధాకరమని, కుటుంబ సభ్యులకు సహకార సంఘం, బ్యాంకు సిబ్బంది తరుపున సానుభూతి తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్,క్యాషియర్ మౌనిక,జానీ,సిఈఓ మోహన్ రావు, సొసైటీ సిబ్బంది మురళి,రమణ రెడ్డి, బ్యాంక్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ నేత దొండపాటి వాసు జన్మదిన వేడుకలు

■ శ్రీనన్న సైన్యం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణి



జూలురుపాడు,జూలై 23 (నవభూమి ప్రతినిధి)సమాజ హితమే అతని అభిమతం. గ్రామాభివృద్ధి కే అతని మొదటి ప్రాధాన్యత.యువశక్తి మాత్రమే సమాజ మార్పుకు నాంది అని అతని ప్రగాఢ విశ్వాసం.అభాగ్యులకు ఆపన్న హస్తం అందించుట లో అగ్రభాగాన నిలుస్తూ సొంత నిధులను అలవోకగా ఖర్చు చేస్తూ ఆత్మ సంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. ఆయనే మండల పరిధిలోని కాకర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దొండపాటి శ్రీనివాస రావు (వాసు). దొండపాటి శ్రీనన్న సైన్యం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రధాన రహదారి పై గల రాజీవ్ గాంధీ చౌరస్తా నందు యువకులు కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా సేవలలో దొండపాటి ముందుంటారని కొనియాడారు.రోగులకు సేవలు,యువకులకు క్రీడలలో ప్రోత్సాహం అందిస్తుంటారు.ఆధ్యాత్మిక కార్య క్రమాలలో ముఖ్యంగా మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ఆర్థిక సహాయం అందిస్తుంటారు.కిడ్నీ సంబంధిత వ్యాధి గ్రస్తులకు డయాలసిస్ కొరకు ఎమ్మెల్యే ద్వారా ఎల్ ఓ సి అందజేశారు.త్రాగు నీటి కొరకు బోర్ వెల్ లు ఇప్పించారు.పాపకొల్లు గ్రామంలో నిరుపేద కుటుంబం వ్యక్తిని కోల్పోతే దశ దిన కార్యక్రమానికి బియ్యం వితరణ చేశారు.ఇలా అనేక విధాలుగా సమాజ సేవలో యువకులు మొదటి వరసలో ఉండాలని సూచిస్తుంటారని అందుకే యువత ఆయన వెంట నడుస్తామని వారు తెలిపారు.ఈ కార్య క్రమంలో మండల యువ నాయకులు కల్లోజి దినేష్,సముద్రాల పవన్,సంపత్,రాజ్ కుమార్,ఉదయ్,బాలకృష్ణ,సాయి,మధు, ప్రవీణ్,వంశీ, మౌళి,బన్ను,చింటూ తదితరులు పాల్గొన్నారు. దుబ్బా తండాలో.... మండల పరిధిలోని కాకర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బా తండాలో దొండపాటి శ్రీనన్న సైన్యం









ఆధ్వర్యంలో దొండపాటి వాసు జన్మ దిన వేడుకలు ఉత్సాహ పూరిత వాతావరణం లో ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు.వారు మాట్లాడుతూ మా గ్రామంలో మిషన్ భగీరథ త్రాగు నీరు ఎద్దడి గా ఉంటే ఎమ్మెల్యే తో మాట్లాడి సమస్య పరిష్కరించారని గుర్తు చేసుకున్నారు. అనేక విధాలుగా సామాజిక సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్య క్రమంలో కిషన్,వీరన్న,నరసింహ, శంకర్,బద్రు, వినోద్,సంతోష్,నరేష్,నగేష్, గోప తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా దంచికొట్టిన వర్షం



ఏర్రుపాలెం,నవభూమి,జూలై 23: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ వర్షం దంచి కొట్టింది.గత రెండు రోజులుగా మండలంలో అన్ని గ్రామాల్లో భారీ వర్షం నమోదయింది.మండల వ్యాప్తంగా ఉరు ములు మెరుపులతో కూడినభారీ వర్షాలు కురుస్తాయని,పెద్దఎత్తున గాలులు వస్తాయని,పిడుగులు పడవచ్చునని వాతా వరణశాఖ తెలియజేసిందని మండల తాసిల్దార్ ఒక ప్రకటన ద్వారా మండల ప్రజలను అప్రమత్తం చేశారు.వాతావరణ శాఖ తెలిపిన విధంగానే గత రెండు రోజు లుగా మండలంలో భారీ వర్షాలు నమోదు అయ్యాయి.మండలంలో బుధవారం ఉద యానికి 98.8 ఎంఎం వర్షపాతం నమోద యింది.బుధవారం రెవిన్యూ,పోలీస్ సిబ్బంది పల్లపు ప్రాంతాలను,వర్షాల ప్రభావంతో రాకపోకలకు అంతరాయం కలిగే ప్రదేశాలను పరిశీలించారు.ప్రజలు వర్షాలు కురిసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,వాగులు,వంకలు దాటవద్దని హెచ్చరించారు.

# బాధిత కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



**ఖమ్మం క్రైం, నవభూమి, జూలై 23** :నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో భాధ్యతలు నిర్వహిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 1 మరణించిన కానిస్టేబుల్ బి. కృష్ణ కుటుంబ సభ్యులకు 8,00,000/- (ఎనిమిది లక్షల రూపాయల) భద్రత ఎక్స్‌గ్రేసియా చెక్కు ను బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

# భట్టి విక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం



**ఎర్రుపాలెం,నవభూమి,జూలై 23:** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో మండలంలో 100 కోట్లరూపా యలతో మంజూరు అయినటువంటి 132/33 సబ్ స్టేషన్ మంజూరు జీవో కాపీని విడుదల చేసిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమి రెడ్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయ కులు,కార్యకర్తలు మండల పార్టీ కార్యా లయంలో బుధవారం భట్టి విక్రమార్క చిత్రపటానికిపాలాభిషేకంచేశారు.మండల ప్రజల తరుపున భట్టి విక్రమార్కకి కృతజ్ఞ తలుతెలియజేశారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, శీలం శ్రీనివాస రెడ్డి,రాజీవ్ గాంధీ,అను మోలు వెంకట కృష్ణారావు,పంబి సాంబ శివరావు,తలుపురెడ్డి నాగిరెడ్డి,కడియం శ్రీనివాసరావు,కంచర్ల వెంకట నరసయ్య, షేక్ ఇస్మాయిల్,బోసు,సామినేని హను మంతరావు,పాండు రంగారావు,గుడేటి బాబురావు,యన్నం పిచ్చి రెడ్డి,నంద్రు బాబురావు,దేవరకొండ శ్రీనివాసరావు, మోగిలి అప్పారావు,ప్రసాద రెడ్డి,గుర్రాల పుల్లారెడ్డి,దేవరకొండ రవి,రామారావు, రామిరెడ్డి,చిరంజీవి,ఏడుకొండలు,మాణి క్యమ్మ,తదితరులు నాయకులు పాల్గొన్నారు

# ఆటోను ఢీకొట్టిన బొలెరో వాహనం - ఒకరి మృతి

**టేకులపల్లి జూలై 23 నవభూమి ప్రతినిధి** : ముందు వైపుకు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న బోలేరు వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో, ఆటోలో ప్రయాణిస్తున్న కొమరం హనుమంతు (58) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దుర్మరణం చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం, టేకులపల్లి మండలం పాత లచ్చగూడెం గ్రామానికి చెందిన కొమరం హనుమంతు, చింత నగేష్, వేప శ్రీలతలు, మంగళవారం అదే గ్రామానికి చెందిన కుంపటి నరేష్ ఆటోలో లచ్చగూడెం నుండి టేకులపల్లి వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో ఇదే మండలం, కోయగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ గొగ్గల ఆదినారాయణ బొలెరో వాహనాన్ని నడుపుకుంటూ వస్తూ, ఆటోను వెనుక వైపున దంతల తండా సమీపంలో గట్టిగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కొమరం హనుమంతు తలకు చేతులకు బలమైన గాయాలు కాగా, వేప శ్రీలతకు దెబ్బలు తగిలాయి. వీరిని వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి ఖమ్మం మమత ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హనుమంతు బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు హనుమంతు కొడుకు కొమరం వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# యూరియా కోసం జోరువానలో రోడ్డెక్కిన రైతాంగం

**టేకులపల్లి జూలై 23 నవభూమి ప్రతినిధి** : రైతాంగానికి సరిపడా యూరియాను అందించాలని, టేకులపల్లి, బొమ్మనపల్లి, బోడు సెంటర్ లలో యూరియా కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతు కూలి సంఘం టేకులపల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో రైతాంగం జోరు వానలో రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. గతంలో ఒక్కొక్కరికి ఐదు నుండి మూడు కట్టలు ఇచ్చి, ఈరోజు ప్రతి ఒక మనిషికి ఒక కట్ట మాత్రమే ఇస్తామని చెప్పడంతో రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్జ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఐ ఎఫ్ టి యు టేకులపల్లి ఏరియా కార్యదర్శి డి ప్రసాదు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను సృష్టించి ఆ తదుపరి సబ్సిడీని ఎత్తివేయాలనే దుర్బుద్ధితో ఉన్నట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. అదే నిజమైతే ఈ చర్య రైతాంగ వ్యతిరేక చర్య అని వారు అన్నారు. రాష్ట్రాలకు యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. రాష్ట్ర మంత్రివర్గం పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిన చలనం లేదని, దాంతో రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు.



తక్షణమే యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. అధికారులు యూరియా కొరత లేదని సరిపడా నిలవలు ఉన్నాయని రైతాంగం ఆందోళన పడాల్సిన అవసరం లేదని అంటూనే మనిషికి ఒక కట్ట ఇస్తామని చెప్పడంలో అర్థం ఏమిటని వారు ప్రశ్నించారు. రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రాంబాబు, రామయ్య, సమ్మక్క, రైతులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలి

- ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్



**పాల్వంచ జులై 23 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వం వెంటనే సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని, అర్హులైన కళాకారులందరికీ సాంస్కృతిక సారధిగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కళాకారులకు బ్యాంకు లోన్లు, వృద్ధాప్య పింఛన్‌లు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పాల్వంచ పట్టణంలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, కుల-మత-జాతి



అహంకారానికి వ్యతిరేకంగా ప్రజల్ని కళాకారుల ద్వారా ఆలోచింపజేసి,సమాజాన్నిచైతన్య పరిచేదే ప్రజానాట్యమండలి' అని పేర్కొన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి జెండాను సీనియర్ కళాకారుడు రాందాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు, నిర్మాణ బాధ్యులు నారటి ప్రసాద్, అధ్యక్ష కార్యదర్శులు సురేందర్, కట్టుకూరి రాము, అడుసుమిల్లి సాయిబాబా, ముత్యాల విశ్వనాథం, విసంశెట్టి పూర్ణచంద్రరావు, నిమ్మల రాంబాబు, కె.కృష్ణ, లక్ష్మి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# వరదలో పగిడేరు - ముంపునకు గురైన గ్రామాలు

- పరిస్థితిని పరిశీలించిన ఆర్‌డిఓ దామోదర్



**మణుగూరు జూలై 23 నవభూమి ప్రతినిధి:** మణుగూరు మండలంలోని 22న సాయంత్రం గంటన్నర సేపు 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. 23న అంతే స్థాయిలో భారీ వర్షం కుండపోతతో కురవడంతో పగిడేరు పంచాయతీ పరిధిలోని ఊర చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించింది. సుమారు 60 ఇళ్ళు ముంపునకు గురయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పగిడేరు(పాతూరు) గ్రామంలో ఊరు ముందు ఉన్న చెరువు అలుగు వాగు మరియు ఊరికి పడమర వైపు గ్రామానికి ఆనుకొని ఉన్న పోచంపల్లి వాగు ఉధృతికి పగిడేరు తీవ్ర వరద ముంపునకు గురైనది. గ్రామం మొత్తం వరద ప్రవాహం ముంచెత్తినది నివాస ప్రాంతాలలోకి నీరు చేరిందని నిత్యవసర వస్తువులు నీట మునిగినాయి ప్రజలు తాగేందుకు మంచినీళ్లు లేక వండుకునేందుకు ఆహార పదార్థాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఆర్ డి ఓ దామోదర్ పగిడేరు గ్రామంలో శాంతినగర్ అలుగుముంపు ప్రాంతాలను మరియు పాతూరు వరద ప్రభావిత





ప్రాంతాలను పరిశీలించారు. వరద సమయంలో అధికారుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచినీరు ఆహార పదార్థాలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ నరేష్, ఎంపీడీఓ టి శ్రీనివాసరావు, ఆర్ఐ గణేష్, గ్రామ కార్యదర్శి మణికంఠ, గ్రామ మాజీ సర్పంచ్ తాటి సావిత్రి, సిపిఎం నాయకులు కుంజా రాజా, కుంజ నరసింహారావు, ప్రజలు పాల్గొన్నారు

# మైనర్ కుతురును కొట్టిన తండ్రిపై కేసు నమోదు




**బూర్గంపాడు జూలై 23 నవభూమి ప్రతినిధి:** బూర్గంపాడు లో మైనర్ బాలిక (8) ను తండ్రి కొట్టుతున్నాడని టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ సాదిక్ పాషా, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ బానోత్ సందీప్,కేస్ వర్కర్ జి. భవాని, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యునిట్ పివో యన్.ఐ.సి. అదూరి శేషయ్య, అవుట్ రీచ్ వర్కర్ యస్. లతా, ఐసిడిఎస్ సుపర్ వైజర్ సక్కుబాయి తదితరులు బూర్గంపాడు, బాలిక ఇంటికి రెస్కుకు వెళ్లి చేయగా బాలిక అమ్మమ్మ ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. బాలికతో వీడియో కాల్‌లో మాట్లాడిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ సాదిక్ పాషా జరిగిన విషయం తెలుసుకుని, బాలిక తండ్రిపై పోలీస్ కేసు నమోదు కు ఆదేశాలు ఇచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాలతో సూపర్ వైజర్ సక్కుబాయి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ సాదిక్ పాషా తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాల బాలికలను ఎవరైన కొట్టిన, చైల్డ్ మ్యారేజ్లు చేసిన, చైల్డ్ లేబర్ గా పని చేయిస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫిర్యాదు చేయలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ సాదిక్ పాషా తెలిపారు.

# నవ లిమిటెడ్ ఉచిత దంత వైద్య శిబిరాన్ని సందర్శించిన

## డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్

**కొత్తగూడెం జులై 23 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో బుధవారం నవ లిమిటెడ్, రోహిణి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్య శిబిరాన్ని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నవీన్ ఈ నికోలస్ సందర్శించారు. సంస్థ ప్రతినిధులు ఈ ఉచిత శిబిరంలో జరుగుతున్న వైద్య పరీక్షలను గురించి ఆయనకు వివరించారు. విద్యార్థులకు డైరెక్టర్ దంత వైద్య కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నవ లిమిటెడ్, రోహిణి ఫౌండేషన్ సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

■ ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్

**మణుగూరు జులై 23 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వ ఐటిఐలో 2025 సంవత్సరంలో 2వ విడిత ప్రవేశలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణుగూరు ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీ లలో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి 31వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లోని ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్మెన్ సివిల్, డీజీల్ మెకానిక్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోప)లతో పాటు మణుగూరు ఏటీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కోర్సులలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్. 1 సంవత్సరం, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ 1 సంవత్సరం, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్డ్ టూల్స్ 1 సంవత్సరం, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్2 సంవత్సరాలు , అడ్వాన్స్డ్ సి ఎన్ సి మిషనింగ్ టెక్నీషియన్, 2వ సంవత్సరాలు , మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ 2 సంవత్సరాలు, కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న వారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ప్రవేశం పొందదలిచినవారు. లో ఆన్లైన్ చేసుకొవలన్నారు. ఈ అవకాశాన్ని భద్రాద్రి జిల్లా, పినపాక నియోజకవర్గం లోని యువతి యువకులు సద్వినియోగం చేసుకొని మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు.



# మసక బారుతున్న ప్రభుత్వ విద్యను కాపాడాలి

**కొత్తగూడెం జులై 23 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వ విద్య మసకబారుతుందని దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని, ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులు బడిబాట పట్టాలంటే సమస్యల పరిష్కారమే మార్గమని నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాల కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్యా అభి మన్యు పిడిఎస్యు జిల్లా కార్యదర్శి గణేష్ పిడిఎస్యు జిల్లా నరేంద్ర ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు స్థానిక కొత్తగూడెం బుధవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల చేపట్టిన బంద్ లో భాగంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సంపూర్ణం. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల కళాశాలలో మౌలిక వసతులు కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయితే విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులుకు గురికావాల్సి వస్తుందని, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో నమ్మకం




కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఉపాధ్యాయులపై ఉందన్నారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాల కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ నాయకులు గుండాల సుజన్ సంజయ్ వినయ్ ఎస్ఎఫ్ఐ నాయకులు రెస్వాత్ వినీల్ పి డి ఎస్ యు నాయకులు శ్యామ్ భార్గవ్ పాల్గొన్నారు.

## విద్యారంగం సమస్యలపై

# దశలవారీ పోరాటం చేస్తాం...యుటిఎఫ్,టిపిటిఎఫ్

**ఎర్రుపాలెం,నవభూమి,జులై 23:** విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలు పోరాటకమిటీ యుఎస్ పిసి ఆధ్వర్యంలో 3 దశల పోరాటంలో భాగం గా బుధవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఐ రవికుమార్ ఏఎస్ఓ జాన్ దర్గా సహెబ్ లకు తమసమస్యల పరి ష్కారం కోరుతూవినతిపత్రం అందించా రు.ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యా యులు ఉండాలని,పిఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని,కేజీబీవీ, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు బేసిక్ పే,అన్ని రకాల బిల్లులు వెంటనే విడుదల చేయాలని,రిటైర్డైఉపాధ్యాయులకు పెన్షనరీ బెనిఫిట్స్,సిపిఎస్ రద్దు,సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతం,గిరిజన సంక్షేమ,ఆశ్రమ పాఠశాలలో పండిట్,పిఈ టి పోస్టు అప్ గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని,మోడల్ స్కూల్,గురుకుల సిబ్బందికి 010పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని,గురుకుల పాఠశాలల టైం టేబుల్ సవరణ జీవో 317 ద్వారా నష్ట పోయిన వారికి స్థానిక జిల్లాలకు బదిలీ, ఎయిడెడ్ పాఠశాలను ప్రభుత్వంలో విలీనం,పెండింగ్ డిఎ లను విడుదల చేయాలని,పిఆర్సి ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్య దర్శి అనుమోలు



కోటేశ్వరరావు,టిపిటి ఎఫ్ మండల నాయకులు అన్నవరపు దామోదర రావు,భూషణ్ రాజ్,సూర్య నారాయణ,యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు,ఉపా ధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు,క్రీడా కార్య దర్శి మారబతుల నాగేశ్వర్ రావు,నీలం అజయ్ కుమార్,సుబ్బ రామరాజు,సత్య నారాయణ,నవీన్,రావిరాల భరత్ తది తరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు

**కూకట్ పల్లి, నవభూమి ప్రతినిధి, జూలై 23** : తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాలను గతంలో కంటే మరింత అద్భుతంగా నిర్వహించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసించారు. అల్లాపూర్ డివిజన్‌లోని శ్రీ వివేకానందనగర్‌లో పోతుగంటి సుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారి సేన ఏర్పాటు చేసిన తొట్టెల మహోత్సవంలో బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ నల్లపోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, సీనియర్ నాయకులు మస్తాన్ రెడ్డి తో కలిసి తొట్టెల ఊరేగింపులో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి సేన సభ్యులు దీపక్ కుమార్, రాజేష్, సాయి తేజ, మల్లికార్జున రెడ్డి, సూర్య, శ్రీధర్, వెంకట సాయి, పుష్కల్, శరత్, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో



కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శివ చౌదరి, రమణ, జమీల్ భాయ్, సాజిద్, డివిజన్ నేతలు రవీందర్ ముదిరాజ్, ఆది నారాయణ, సతీష్ రెడ్డి, బొంత రవి, సత్య నారాయణ, పవన్ కుమార్, రమేష్ ఆచారీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దండి సురేష్‌కు శుభాకాంక్షలు వెల్లువ

**ఖమ్మం రూరల్, నవభూమి, జూలై 23:** సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దండి సురేష్ కు శుభాకాంక్షలు వెల్లువలా కొనసాగుతుంది. ఆయనను ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో జర్నలిస్టులు, సిపిఐ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి, పుష్పగుచ్చాలు అందజేసి శాలువలతో సత్కరించారు. తొలుత అక్కడి ఆంజనేయస్వామి ఆలయంలో దండి సురేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రామిశెట్టి విజేత, జనం సాక్షి జిల్లా ఇన్చార్జ్ కూరాకుల గోపి, ఖమ్మం రూరల్ మండల జర్నలిస్టులు నంద్యాల ఉపేందర్( ఆంధ్రజ్యోతి) , జక్కంపూడి కృష్ణ (నవ తెలంగాణ), తీగల నాగరాజు (ఆంధ్రప్రభ), ఖమ్మం బిఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, దరిపల్లి శ్రీను, మాజీ మార్కెట్ డైరెక్టర్ దండి నరసయ్య , రియల్ వ్యాపారులు అయితగాని రాములు, రామారావు, నాయి బ్రాహ్మణ అసోసియేషన్ సభ్యులు సైదులు, వెంకన్న, అనిల్, సిపిఐ ఆరెంపుల గ్రామ శాఖ సభ్యులు బండి వెంకటేశ్వర్లు, మట్ట నాగిరెడ్డి, నాగండ్ల లక్ష్మీనారాయణ, బ్రహ్మాచారి, పలు గ్రామాల సిపిఐ శాఖ సభ్యులు తదితరులు ఉన్నారు.







# విజయవంతమైన జాబ్ మేళా

- క్రమశిక్షణ, నైపుణ్యత ఉంటే ఉద్యోగం పొందటం సులువు
- వేల్పుల విజేత






**ఖమ్మం రూరల్, నవభూమి, జూలై 23:** మండలంలోని దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా సమర్ధనం ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా విజయవంతమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. క్రమశిక్షణ, నైపుణ్యత కలిగి ఉంటే ఉద్యోగంలో రాణించవచ్చని, ఈ జాబ్ మేళాలో ఎక్కువగా మహిళలు హాజరు కావడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ రోజుల్లో ఉపాధిని పొందేందుకు చాలా శిక్షణ మార్గాలు ఉన్నాయని, తద్వారా నైపుణ్యత పెంచుకొని ఉపాధి పొందేందుకు కృషి చేయాలని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ప్రైవేట్ రంగంలో సైతం ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ప్రతిభతో ఉద్యోగం పొందాలని ఆకాంక్షించారు. జాబ్ మేళా నిర్వాహకులను అభినందించారు. 30 కంపెనీ లు పాల్గొన్న ఈ జాబ్ మేళా నందు 250 పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమర్ధనం రిపోర్టింగ్ ఆఫీసర్ సెంథిల్, తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ నలుపు శ్రావణ్ కుమార్, దరిపల్లి విద్యాసంస్థల అధినేత, ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కోడిరెక్క ఉమా శంకర్, వివిధ కంపెనీల హెచ్.ఆర్ లు పాల్గొన్నారు.

# మండల జన్నమ్మకు పలువురి నివాళి




**ఖమ్మం రూరల్, నవభూమి, జులై 23:** అనారోగ్యంతో మృతిచెందిన మండల జన్నమ్మకు పలువురు నివాళులర్పించారు. మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మండల యాదగిరి భార్య జన్నమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం నిమిత్తం మంగళవారం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సూర్యాపేట వద్ద మృతిచెందింది. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు స్వగ్రామం చింతపల్లికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం చిన్న క్రిష్ణారావు, జిల్లా నాయకుడు తోట వీరభద్రం, తెలంగాణ గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కం లింగయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం పెద్ద క్రిష్ణారావు, కొత్తపల్లి రాంబాబు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమ ప్రగాడ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో తెలంగాణ గౌడ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సూదగాని యల్లయ్య, మండల కార్యదర్శి హనుమంతరావు, మండల యూత్ అధ్యక్షుడు ఏడుకొండలు, సైదులు, నరేష్, మాజీ సర్పంచ్ తోట జగన్, తోట చిన్న అప్పయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.